# అమెరికాలో మరో ఆంధ్రా విద్యార్థి మృతి



రాజీవ్‌రెడ్డి

తిరువూరు, న్యూస్‌టుడే: అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అసువులు బాసిన నలుగురు ఆంధ్రా విద్యార్థుల మృతదేహాలు ఇంకా రాష్ట్రానికి చేరక ముందే న్యూయార్క్‌లో మరో ఘోరం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన మల్లాడి రాజీవ్‌రెడ్డి(28) చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి తాత, అమ్మమ్మ సంరక్షణలో పెరిగారు. 2004లో శ్రీనిధి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ (కంప్యూటర్స్) పూర్తి చేసి 2006లో ఎంఎస్ చేయటానికి అమెరికా వెళ్లారు. న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో దానిని పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం లాంగ్ ఐలాండ్ నుంచి న్యూయార్క్ వెళ్లటానికి రైలు ఎక్కుతూ కాలుజారి కింద పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. దాంతో తాత, అమ్మమ్మ హుటాహుటిన అక్కడకు బయల్దేరారు. రాజీవ్‌రెడ్డి అంత్యక్రియలకు అయ్యే ఖర్చును తాము భరిస్తామని తానా కార్యదర్శి తోటకూర ప్రసాద్ తెలిపారు. అమెరికాలో నెల వ్యవధిలో జరిగిన వరుస ప్రమాదాల్లో ఏడుగురు విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు.

న్యూజెర్సీ, మార్చి 26 : న్యూజెర్సీలో ఓ ప్రవాసాంధ్ర ఇంజనీర్ గుండెపోటుతో మృతి చెందారు. చిత్తూరుకు చెందిన ఉదయ్ తోట (33) న్యూజెర్సీలోని ఫైజర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. మొన్న సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో ఉదయ్ అకాల మరణం చెందినట్లు 'తానా' ప్రధాన కార్యదర్శి తోటకూర ప్రసాద్ ఓ ప్రకటనలో తెలియజేసారు. చిత్తూరుకు చెందిన ఉదయ్ 1997లో విజయవాడలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసారు. అనంతరం ఇక్కడ విప్రోలో పనిచేసి 2002లో అమెరికా చేరుకున్నారు.

## గుండెపోటుతో ఇంజనీర్ మృతి

న్యూజెర్సీ : చిత్తూరు జిల్లాకు చెందిన ముప్పై మూడేళ్ళ యువ ఇంజనీర్ ఉదయ్ తోట తీవ్ర గుండెపోటుతో న్యూజెర్సీలో అసువులు బాసారు. మార్చి 23 సోమవారం రాత్రి 7.30 గంటలకు తీవ్రంగా వచ్చిన గుండెపోటుతో ఉదయ్ అకస్మాత్తుగా మరణించారు. న్యూజెర్సీలోని ఫిజర్ సంస్థలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న ఉదయ్ కు భార్య, టీచర్లుగా రిటైరైన తల్లిదండ్రులు, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు.

చిత్తూరు జిల్లా పుత్తూరుకు చెందిన ఉదయ్ విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల నుంచి 1997లో బిటెక్ ఇంజనీరింగ్ డిగ్రీ పొందారు. అనంతరం భారతదేశంలో విప్రో సంస్థలో ఉద్యోగం చేశారు. 2002లో ఆయన అమెరికా వచ్చారు. గ్రీన్ కార్డు హోదా ఉన్న ఉదయ్ ఎనిమిది నెలల క్రితమే వివాహం చేసుకున్నారు. ఉదయ్ మరణించే సమయానికి ఆయన భార్య దగ్గర లేరు. సెలవు మీద ఆమె కొద్దిరోజుల క్రితమే భారతదేశం వెళ్లారు.

ఆంధ్రరాష్ట్రానికి చెందిన యువ ఇంజనీర్ ఉదయ్ ఆకస్మిక మృతికి తానా కార్యదర్శి ప్రసాద్ తోటకూర ఒక ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో ప్రవాసాంధ్రుల మరణ వార్తలు వినడం తమను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యూయార్క్ లోని భారత రాయబార కార్యాలయాన్ని తాను సంప్రతించానని, ఉదయ్ మృతదేహాన్ని వీలైనంత తొందరగా భారతదేశం పంపించేందుకు కావాల్సిన ఏర్పాట్లను తానా సంస్థ తరఫున చేస్తున్నామని ఆయన ప్రకటించారు. ఉదయ్ కుటుంబసభ్యులకు తానా తరఫున ప్రసాద్ తోటకూర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. ఉదయ్ తోట ఆత్మకు శాంతి కలగాలని ఆయన నివాళులు అర్పించారు.